6 హరిజన సమస్య

గంటకి నలభై మైళ్ళ వేగంతో ఎగిరిపోతున్న కారు ఏమీ మారుమాట లేకండా ఆగిపోయింది రోడ్డు మధ్య. అరగంట సేపు డ్రైవరు కెలికి చూసినా, ఉలకలేదు, పలకలేదు. ఈ అద్దె కార్లు ఇంతే, నమ్మ డానికి వీల్లేదు అనుకున్నాడు. వెనక సీట్లో కూచున్న డైరెక్టరు. అను కుంటే చాలు, యజమాని మాటని గ్రహించి పరిగె తే సజీవమైన జంతువుమల్లే, మంత్ర బలంతో ఎగిరే పుష్పకం మల్లే వెళ్ళే కారు, ఏ మాత్రం ఇన్టిమేషన్ లేకండా వుత్తరాయిమల్లే అయిపోవడం ఎంత ఆశ్చర్యం అనుకున్నాడు. అతని పక్కన కూచున్న కథకుడు! గదుల్లో చెయ్యడానికి సిగ్గుపడే పనుల్ని కార్లలో చెయ్యడానికి ఉపయో గించుకోడమే గాని, కారు బానెట్ తెరిస్తేదయ్యాలుంటాయో, పేగు లుంటాయో కూడా తెలీదు వాళ్ళిద్దరికీ.

"ఇంక లాభం లేదంటావా?"

"ఏబ్బే ఫరవాలేదు. కూచోండి."

"ఫరవా ఏం లేదు లే. రాత్రికి తిండి లేకపోయినా, కప్పుకు పడుకోడానికైనా ఏం లేదు."

ఆ రోడ్డు తమ కారు వెళ్ళడానికి మాత్రమే బోర్డువారు నిర్మించి

వట్టున్నారు. అరగంటలో ఏ బండిగాని, కారుగాని, మనిషిగాని, అటు రాలేదు.

చుట్టూ చిట్టడివి. ఆ అడివితో ఏ మనిషికీ, మృగానికి, పిట్టకి కూడా అవసరమున్నట్టు తోచదు. "ఈ సిట్యుయేషన్ చాలా బావుందోయ్. నీ కథానాయకని ఇట్లాంటి చోట strand చేయించు," అన్నాడు డైరెక్టరు. సాయంత్ర మవుతోంది. ఇంకా యాభై మైళ్ళు పోవాలి. మధ్యాన్నం ఎండనించి కారుని రక్షించిన చెట్లు, బెంగ పుట్టించే నీడల్ని పొడుగు చేసుకుంటున్నాయి.

మిధ్యావ్యవహారం మీద బైలుదేరినందుకు బాగా జరిగింది. ప్రొడ్యూసర్ తాను వలచి తెచ్చుకున్న బరువు బాలీసుని కథానాయిక చెయ్యాలంటాడు. "నీ మూడు లక్షలూ గోదావరిలో పొయ్యక పోయినావా, ఇంతదూరం వొచ్చి ఫిల్మ్ పేర తగలెయ్యాడ మెందుకు?" అన్నాడు డైరెక్టరు. తనకి వళ్ళు్యరాలు కావి. అనాఘ్రాత పుష్పాన్ని అని చాటుకునే ఒక పేరెక్కిన నక్షత్రాన్ని కథానాయకిగా తీసుకుని తాత్కాలిక ప్రాణనాయకను చేసుకోవాలని డైరెక్టరు తాపత్రయం. తన పిన తండ్రి కూతురూ, తనకి ప్రేమాస్పదురాలైన విద్యావతిని మనస్సులో పెట్టుకుని వర్ణించి కథ రాశాడు కథకుడు. తమ అంతరార్థాలని ఎవరూ బైట పెట్టక తర్కించుకున్నారు మూడు నెలలు. చివరికి విసుగెత్తి, ఎవరూ వినని కొత్త కన్యను సంపాయిస్తామనే మిషతో బైలుదేరారు, talent అన్వేషణలో. ఆ పల్లెటూరు వెళ్ళి వొస్తోవుంటేనే ఈ విఘాతం పాపం, వాళ్ళకి. ఆమె తన ఫోటో పంపి. పెద్ద ఉత్తరం రాసింది. ఒక యాభై వేలు తాను పెట్టుబడి పెడతా నంది, యాభై వేల మూటతోనూ ప్రయాణమయింది వీళ్ళిద్దరితోనూ. అప్పటి కప్పుడే పాడింది, ఆడింది, నాటకాలు వొప్ప చెప్పింది. చాలా బాగానే వుంది వ్యవహారం. అసలు మర్నాడు బైలుదేరదామనుకున్నారు. కాని ప్రతి అదృష్టానికీ అడ్డంగా ఓ వక్రగ్రహం వుంటో వుంటుంది. ఆ మధ్యాన్నం డైరెక్టరు నిద్రపోతూ వుండగా గుండెల మీద కూచుని లేవకొట్టాడు, కాంతారాయుడు. అతని దా వూరని కూడా తెలీదు డైరెక్టరుకి. కాంతారాయుడు మూడు హత్యలకన్నా కారకుడని ప్రసిద్ధి. లక్షాధికారి, ప్రభు

త్వపు మంత్రుల్లో ఒకరిని సింహాసన మెక్కించిన మనిషి. డైరెక్టరు కళ్ళు తెరిచాడో లేదో, బొబ్బిలి పాపారాయుడి మల్లే, ఒథెల్లో వేషంలో రాఘవాచారిగారి మల్లే శబ్దం లేకండా గర్జించాడు.

"అది నా తమ్ముడి భార్య, దానికి సినీమాల పిచ్చెక్కింది. దాన్ని చేర్చుకున్నావా, మీ ఫిల్మ్‌కి వేరే డైరెక్టర్ని చూసుకోవాలి. నువ్వు పొలిమేర దాటవు. నా పేరు కాంతారాయుడు!" అని అంతర్ధాన మైనాడు,

ఎగబడి కారులోకి యాభై వేలతో పాకే ఆ కాంతాలలామని తప్పించుకుని పరుగెత్తుకు వొచ్చారు వీళ్ళిద్దరూ. మధ్యలో కారు ఆగింది. వెనక కాంతారాయుడు రావటం లేదుకద! ఈ డ్రైవరుకి లంచం ఇచ్చి ఆపించలేదు కద!

"దగ్గిర ఊరు ఎంత దూరం వుంటుంది?"

"ఏమోనండి. నా కీ రోడ్డు కొత్త."

ఏమైనా కానీ ఇంక ఆ నిర్జీవ ప్రదేశంలో నిలవకూడదు.

"మేం వెడుతున్నాం. కారు బాగైతే వెనకాల తీసుకురా."

నడక సాగించారు. చీకటిపడ్డది. దోవలో పాము లుంటాయో, పులులే దూకుతాయో! దూరంగా దీపం. దీపాలు; మెల్లిగా. అవి గాసు లైట్లు. ఇంకా కొంచెంలో చాలా మధురమైన సన్నాయి వాయిద్యం.

అమ్మా! ఏదో వూరు. పెళ్ళిగావును. కాని పెళ్ళిళ్ళ కాలం కాదు. అదృష్టాన్ని నమ్మలేదు ఇంకా వాళ్ళు. దెయ్యాలేమో! కాక పోతే పొరుగూరు వెళ్ళే పెళ్ళి ఏమో! కాక కాంతారాయుడు కాడుకద! ఏమీ ఆశ్చర్యం వుండదు. లైట్లతో, వాయిద్యాలతో ఎదురొచ్చి వాళ్ళి ద్దర్నీ పట్టుకుని కట్టి తీసికెళ్ళి ఏ పోలేరమ్మకో బలి ఇచ్చినా, ఈ నైజాంలో ఇంక దిక్కూ మొక్కూ ఎక్కడ? ఏం చెప్పిందో ఆ ఆడది? తనని వెనకనించి రమ్మన్నారని చెప్పలేదు కద బావరిగారితో!

సమీపించారు. తోటలు ఇళ్ళు, గుంపు. అదేదో సమాధి. తీర్థం లాగుంది. మొక్కు బళ్ళు చెల్లించుకుంటున్నారు. ధైర్యా లొచ్చాయి వాళ్ళకి. "చూశారా మూర్ఖం? మతం పట్లు వొదలా లంటారు ప్రభుత్వం" అన్నాడు కథకుడు.

"రాజకీయాల్లోకి తీసుకురా వొద్దంటారు, అంతే."

"జీవితంలో కల్లా ప్రముఖమైన కులం, మతం రాజకీయాల్లోకి రావడంఆపడం ఎవరి తరం? అందుకనే రష్యాలో దేవుడి పేరు చెపితే నరికేస్తా మన్నారు. ఎన్ని ఉపన్యాసా లిస్తే మాత్రం అగుతుందా ఈ దేశంలో?"

"రష్యాలో నరికేస్తా మన్నారని నీ కెట్లా తెలుసు?"

"అనుకుంటారు."

"రష్యాలో మల్లె ఇక్కడా చెయ్యా లంటావా?"

"తప్పకండా."

"అట్లా చేసి ఈ మూర్ఖమే పోతే, నీ కథలకీ, నా ఫిల్ములకీ ఏం డబ్బు వొస్తుంది? భక్తి పోయిం దంటే, ఇంక చలం కథలే గతి."

"అంటే?"

"శృంగారం."

"శృంగారమైతే మాత్రం చలం కథలే ఎందుకు?"

"భక్తితో పాటు పాతివ్రత్యం మార్కెటు కూడా పడిపోతుంది. ఇంక బ్లాక్ మార్కెట్టే గతి, అంటే చలం."

"ప్రేమ లేదా?"

"వుందిలే. మీ రందరూ ఏం చేస్తున్నా రిప్పుడు మాత్రం? శృంగార ఘట్టాల్లో తెలిసో తెలికో అతని వాక్యాలేగా దొర్లిస్తు న్నారు."

"పోనీ, అభ్యుదయ కథలు తియ్యకూడదూ?"

"అంటే ఆకలేగా? ఆకలేస్తోంది. భోజనం సంగతి ఆలోచించు."

"ఏమిటి ఆ ఫలహారం తరవాత కూడానా? మధ్యాన్నం ఆకలీ, శృంగారం రెండూ కలిసి వొచ్చాయిగా నీకు?"

ఆమె బలవంతం చేసి ఆవడలు, పూరీలు, చంద్రకాంతలు, హల్వా, సేమియా వాళ్ళిద్దరికీ నోళ్ళలో తన చేతులతో కూరింది.

"ఇంకా ఆకలి లేదులే. కాని...."

ఒక యువకుడు సమీపించి కుశల ప్రశ్నలు, పుట్టు పూర్వోత్త రాలు అడిగాడు వాళ్ళని. డైరెక్టరు పేరు పని చేసింది. తన యింటికి ఆహ్వానించాడు. పొద్దున్నే బండీ చేసి దగ్గిర బస్సులు నడిచే రోడ్డుకి పంపిస్తా నన్నాడు.

ముగ్గురూ పడిపోయిన చెట్టుమీద కూచున్నారు, తమాషా చూస్తో. "ఏమిటి ఈ తీర్థం?"

"తెలీదా మీకు? హరియోగి గారి సమాధి అది. చంపేశాం అయన్ని మేము. ఇప్పుడు ఉత్సవాలు చేస్తున్నాం. మొక్కుకుంటాము; వ్యాజ్యాలు గెలవడానికి, పిల్లలకి, జబ్బులకి అన్నిటికీ."

"నిదర్శనం వుంటుందా?"

"ఆc."

విద్యావంతుడిమల్లే ఉన్నాడా యువకుడు.

"ఎందుకు చంపారు ఆ యోగిని?"

"చాలా మంచి కథ. వింటారా?"

"కానీండి."

"అదేదో సినిమా చూస్తున్నట్టుగా వుంది, డైరెక్టరుకి కూడా. ఆ సన్నాయి వాయిద్యం; చామంతి, మందార, చంద్రకాంత పూలు పెట్టుకుని, పట్టు చీరెలు అలంకరించుకున్న యువతులు, పళ్ళాలలో పూజా ద్రవ్యాలు పట్టుకుని; లైట్లు. ఇంకా చలిలేనిగాలి, చుట్టూ చీకటి, అడివి, ఆ దుంగ మీద వాళ్ళు ముగ్గురూ.

"నా చిన్నతనం. ఇరవై ఐదేండ్లకింద గావును, ఎక్క ణ్ణించి వొచ్చాడో ఓ నాడు మా వూళ్ళో తిరుగు తున్నాడు. తెలుగు మనిషే. ఎన్నో ఏళ్ళు ఎక్కడో వుండి వొచ్చాడు గావును. అప్పటికే నడి వయసు దాటింది. ఒంటి మీద బట్టలేదు. మాట్లాడడు. కళ్ళెత్తి ఎవరివంకా చూడడు. పిలిచి పెట్టినా, పళ్ళుతప్ప ఏమీ తినడు. తర్వాలో అతన్ని మహాత్ముణ్ణి చేసుకున్నారు వీళ్ళే. రాత్రులు ఏ చెట్టుకిందో పడుకుంటే, పోయి గోల చేసేవాళ్ళు, పిల్లల కోసం, రోగాల నయంకోసం, తప్పిపోయిన గొడ్లకోసం. విసుక్కుని లేచిపోయి ఇంకో చెట్టుకింద పడుకునేవాడు. మేము పిల్లలం; పగలు

అతన్ని ఏడిపించేవాళ్ళం-పెద్దవాళ్ళు చూడకుండా తిట్టీ, రాళ్ళేసీ, గడ్డం లాగీ. చాలా మందికి కోరికలు నెరవేరాయి అనేవాళ్ళు.

ఓ రాత్రి హఠాత్తుగా మాట్లాడాడు తెలుగులో, పిల్లలకోసం వొచ్చిన ఒకామెని-

"వెళ్ళి ఓ కుర్రాణ్ని చూసి పడుకో. నా దగ్గిర ఏముంది" అన్నాడు నలుగుర్లో.

దాంతో హడిలిపోయినారు.

ఆమె ఈ వూరి పెద్దరైతు భార్య. దాంతో అతని మీద ద్వేషం రేగింది. ఆనాటినుంచి అతను మౌనం వొదిలాడు. అతని గురువు మూడేళ్ళు మౌనం ఆజ్ఞాపించాట్ట. ఆ గడువు తీరిపోయింది. ఓ చాప చుట్టుకున్నాడు నడుం చుట్టూ. తరవాత ఎవరో బట్ట ఇస్తే అది కట్టుకున్నాడు. ఎందు కీవూళ్ళో వున్నావంటే "ఆజ్ఞ" అన్నాడు. అతను మాట్లాడిం తరవాత ఎవరికీ ఏ వరాలూ రావడం లేదు, జబ్బులూ నయం కాలేదు. కడుపులూ రాలేదు. ఎవరన్నా వరంఅడిగితే వేదాంతం చెప్పేవాడు. అతని ఖ్యాతిని విని పొరుగూళ్ళనుంచి వొచ్చేవాళ్ళు గుంపులు. "నాకు చిరకాలంనుంచి కడుపునొప్పి" అంటే, "కడుపునొప్పి ఏముంది? కాని నీ ఆత్మలో నొప్పి సంగతి ఏం చేశావు?" అంటాడు.

"చాలా బీదరికం. కటికి దరిద్రుణ్ణి."

"దరిద్రమంత ఐశ్వర్యం ఎక్కడ వుంది? నీ దగ్గిర పెన్నిధులు వున్నాయి, కావాలా నీకు?"

"శల విప్పండి."

"తవ్వు నీ మనసులోకి తవ్వు దొరుకుతాయి."

ఆ మాట లెవరికి కావాలి? మేం పెట్టే బాధలూ; నిరాదరణ పడలేక క్రమంగా హరిజనవాడ చేరుకున్నాడు.

అక్కడ సూరిగాడు కొంచెం మోతుబరి. ఓ రాత్రి అతని పసిపిల్లవాడికి ఏదో జబ్బు పుట్టింది. తల్లీ తండ్రీ ఆ పసిపిల్లవాణ్ణి ఈ హరియోగి కాళ్ళమీద పడేసి రక్షించమని కాళ్ళు పట్టుకున్నారు.

"మరి బతికిస్తే ఆ కుర్రాణ్ణి నాకు యిచ్చేస్తారా?" అన్నాడు.

ఏమంటారు, ఒప్పుకోక! అంతే. ఆ నిమిషాన జబ్బు పోయింది. దాంతో అదుగో దూరాన, ఆ కొబ్బరి తోపులో ఓగుడిసె కట్టి ఆ సాధువుని దాంట్లో ఉంచారు. కాని ఆ పిల్లవాణ్ణి తీసుకోనే లేదు యోగి. తలిదండ్రులు మాత్రం ఎన్నేళ్ళకీ ఆ కుర్రాణ్ణి యోగిగారి కుర్రవాడికిందే చూశారు.

ఆ యోగిగారు అక్కడ స్థిరపడగానే ఆ హరిజనివాడకే యోగం పట్టింది. వాళ్ళ పొలాలు పండాయి. పాడి హెచ్చింది, ప్రభుత్వంవారు సహాయ పడ్డారు. యోగి గారి కీర్తి హెచ్చింది. మా వూరి ప్రజలు కూడా ఎగపడ్డారు. పొరుగూళ్ళ మంచి కూడా ఒకటే గుంపులు. మహత్యాలు జరిగాయి అని కొందరనేవాళ్లు. కొందరు ఏమీ లేదనేవాళ్ళు. క్రమంగా ఆయనే తగాదాలు పరిష్కారం చెయ్యడం, పోట్లాటలు మాన్పడం, సలహా లివ్వడం దగ్గరికి వొచ్చింది. సూరిగాడి కుటుంబంమీద యోగి గారికి అభిమానంలాగు వుండేది. ముఖ్యానికి అతని కుర్రాడు వీరన్నని తన సొంత కొడుకులాగే చూసుకున్నాడు. మాతోపాటు వాడూ పక్కవూళ్లో హైస్కూల్లో చదువుకునేవాడు. శలవల్లో మేం పగలంతా యోగి గారి తోటలోనే గడిపేవాళ్ళం. ఒక్కొక్కప్పుడు రాత్రులు అక్కడే పడుకునేవాళ్ళం. హరిజనులు మా పేటలోకి రాకూడదు. కాని ఒక్క ఆ ఆశ్రమంలో మాత్రం సమానులమై కలుసుకోడానికి మా వాళ్ళకీ అభ్యంతరం వుండేదికాదు. ముఖ్యానికి ఆ నాటి మా ఊరి యువకు లందరమూ ఆయన శిష్యులం ఒక విధంగా. ఆయన మామూలు పురాణాల ధర్మసూక్తులే చెప్పేవాడు. సత్యం, శౌచం; అహింస, దయ, ఇట్లాంటివి. కాని అవి ఒక అనుభవంతో, నిశ్చయంతో వొచ్చి మా మనసుల్ని నాటుకునేవి.

ఆయన వాక్కు వినడమే, ఆయన దగ్గిర కూచోడమే మాకో సంతోషం.

మేం కాలేజీకి వెళ్ళి నేర్చుకోడం, పత్రికలు చదవడం, దేశంలో పెద్దల్ని కలుసుకోడం, మా కాలేజీలో డిస్కషన్లు చెయ్యడం, రాజకీయాల పుస్తకాలు చదవడం-వీటితో మాలో మాకు భేదాభిప్రాయాలే గాక యోగి గారి ధర్మబోధనలు వుత్తపురాతనపు చాదస్తా లనిపించాయి.

కలవలకి ఇంటికి వొచ్చినప్పుడు ఆయనతో వాదించేవాళ్ళం. ఆయన అన్నిటికి అంగీకరించేవాడు. కాని ఆ అంగీకారం మాకు తృప్తిగా వుండేది కాదు.

"ఈ పూజలూ, భజనలూ వృత్తఅర్థంలేని పనులు. పురాతనపు మూర్ఖత్వాలు" అంటే-

"నవీన మూర్ఖత్వాలు పురాతన మూర్ఖత్వాల కన నయమా?" అని నవ్వాడు.

"నవీన పద్ధతుల్లో మూర్ఖత్వం లేదు."

"కొన్నాళ్ళకి ఇవీ పురాతనమైన మూర్ఖత్వాలై పోవా?"

"అసలు దేవుడ దున్నా డన మే మూర్ఖం."

"ఎందుకు?"

"వున్నాడని ఎట్లా తెలుసు?"

"లేదని యెట్లా తెలుసు?"

"లేనిదాన్ని తెలుసుకోడ మెట్లా?"

"ఉన్నదాన్ని తెలుసుకున్నావా?"

"దేన్ని?"

"నిన్ను."

"తెలీకేం?"

"తెలుసుకుంటే ఇంక దేవుడి ప్రశ్నే లేదు."

వేప చెట్టు కింద అరుగు మీద కూచుని జ్వాలల మల్లె పొదుగ్గా మెరిసే కొబ్బరాకుల వంక చూస్తో ఆయన నవ్వులో, చిన్న హేళనలో ఆయనతో సంభాషించిన రోజులు చాలా గొప్పవి. ఏదో శాంతమైన వాతావరణం, మా ఆశల నించి, ఉద్యమాలనించీ, సందేహాలనించి, తిరుగబాట్ల నించి దాటి పోయిన వాతావరణం వుండేది ఆయన దగ్గిర.

"ప్రస్తుత కాలానికి దేవుడు చాలా అనవరం" అన్నాం మాలో ఒకరం ఓ వెన్నెల రాత్రి.

"ఏం? నాకు మల్లెనే దేవుడూ ముసలి వాడైనాడు గావును."

"అదికాదు. మానవుడే సర్వశక్తిమంతు డైనాడు,"

"ఇప్పుడేం, ఇదివరకూ సర్వశక్తి మంతుడే."

"కాని ఇదివరకుకన్న ఇప్పుడు."
"తనని తాను తెలుసుకుంటున్నా డన్నమాట."
"తనకు దేవుడు అనవసర మనుకుంటున్నాడు."
"చాలా మంచి లక్షణం."
"మరి మీరు ఈశ్వర భ క్తిని ఎందుకు బోధిస్తారు?"
"శ క్తిహీనులకి. మీ బోటి ధీరులకి కాదు."

ఆయన మమ్మల్ని చూసి నవ్వుతున్నా డనిపించింది. ఆయనకి తెలిసిందో ఏమో కొంచెం వుండి, మళ్ళీఅన్నాడు. "ఏబ్బే. ఈశ్వరుడు చాలా అనవసరం. ఎందుకంటే అవసరం వొచ్చినాడు కోపగించడు. 'ఈ నాటికి నాతో పని కలిగిందా?' అని ఎ త్తిపొడవడు."

"అయితే దేవణ్ణి మేం వొదిలెయ్యడం తప్పు కాదంటారా?"

"అనవసర మైనదాన్ని ఆహ్వానించడం చాలా అనవసరం. కాని ఈశ్వరుడి అవసరం చాల తప్పని అవసరం."

"మాకు అవసరం కాదు."

"చెపితినిగా. అవసరం కానన్నాళ్ళు చాలా అనవసరం."

ఇట్లాంటి platitudes మాట్లాడేవాడు ఆయన.

కాలేజీలో మార్పు చెంది ఆయన్ని ధిక్కరించిన మాలో ముఖ్యుడు సూరన్న కొడుకు, యోగి గారి ప్రేమ పుత్రుడు, వీరన్న. అతను తమాషాగా తయారై మానించికూడా దూరమౌతున్నాడు. హరిజనుల్ని అగ్ర కులస్థులు చాలా ఘోరం చేశారనీ, చేస్తున్నారనీ ఇంక ఒక్కవారం, ఒక్కరోజు హరిజనులు ఆ దుర్గతిని సహించకూడదనీ, హరిజన విప్లవం వెంటనే లేవ తీయాలనీ అతని నిశ్చితాభిప్రాయం. ఏ ఉపన్యాసంలో, ఏ సంభాషణలో, యెక్కడైనా అప్రస్తుతంగా అదే మాట, అదే కలవరింత. అతని కేమన్నా పిచ్చి యెక్కిందేమో వనిపించింది. ప్రతి పత్రికకీ వ్యాసాలు పంపేవాడు, అదే పద్ధతి మీద. అచ్చు కాపీ, కాకపోనీ. ప్రతి కలపల్లోనూ తన పేటలో హరిజనులకి ఉపన్యాసా లిచ్చి, యువకుల్ని రెచ్చకొట్టి ఒక సైన్యంగా తయారు చేస్తున్నాడు. ఆ ఉద్రేకాన్నే యోగి గారి ముందు వెళ్ళబోసేవాడు.

"హరిజనులకి జరుగుతున్న ఈ అన్యాయాన్ని ఎట్లా అంగీకరిస్తున్నారు మీరు?" అన్నాడు దూకుడుగా.

"ఆ అన్యాయాలు నా అనుమతి కోరందే" అన్నాడు ఆయన నవ్వుతో.

"మీరు వాటిని అంగీకరిస్తారా?"

"నే నేమిటి? ఎవరూ ఏ అన్యాయాన్నీ అంగీకరించరు."

"కాని, ఈ అగ్రకులంవాళ్ళు అంగీకరిస్తున్నారు."

"అంటే-వాళ్ళ కేదో న్యాయం కనపడుతోం దన్న మాట."

"ఏం న్యాయం? స్వార్థం."

"ఆచారం, కాలం."

"అవి వొప్పుకుంటారా మీరు?"

"నా అంగీకారంతో గాని, అనంగీకారంతోగాని లోకం మారితే ఇంక కావలసింది ఏముంది?"

"నేను ఆచారాన్ని ఒప్పుకోను."

"చాలా మంచి పని."

"వాళ్ళు ఒప్పుకుంటారు."

"చాలా మంచిపని."

"రెండూ ఎట్లా మంచివౌతాయి?"

"నీళ్లూ, నిప్పూ, రెండూ మంచివై నట్టే."

"సరే లెండి. కాని నే నిదంతా మార్చబోతున్నాను."

"తప్పకుండా మార్చు."

"మీ రేమంటారు?"

"ఇప్పు డేమంటాను? మార్చావంటే - కబీరు, బుద్ధుడు, రామానుజుడికన్న గొప్పవాడి వంటాను."

"ముందు ఈ వూరిని మార్చబోతున్నాను."

"మార్చెయ్యి. అదేదో నేనూ నేర్చుకుంటాను."

"ఏమిటి?"

"మార్చే విద్య."

"ఏంలేదు, బలవంతంగా చొరబడటమే!"

"చొరబడి మళ్ళీ బయటికి వొస్తావా, అక్కడే వుంటవా?"
నవ్వాము.
"ఆ ఆవారాన్ని పగలకొడతాను. ఎవరడ్డమొస్తారో చూస్తాము."
"చూడనీరేమో!"
"వాళ్ళకి ఏం అధికారం వుంది, మానవుడు మానవుణ్ణి పశువుగా చూడడానికి?"
"నువ్వూ అదేగా చేస్తున్న పని?"
"నేనా?"
"మరి బలవంతంగా చొరబడేది పశువేగా?"
ఎంత నవ్వాము!
"సర్వసోదరభావం కలిగిస్తాను."
"సోదరుడితో బలవంతంగా కలబడి?"
"కలబడితేగాని బుద్ధిరాదు."
"బుద్ధి తెచ్చుకునే ప్రమేయం లేనే లేదా ఏమిటి, ఇతర్లకి బుద్ధి తెప్పించటమేగాని?"
వీరన్నకి చాలా కోపం ఒచ్చింది.
"మీ వన్నీ వుత్తమాటలు. తీరిగ్గా కూచుని దేవుడి న్యాయం, ఏర్పాట్లు అనే మత్తుమందు. బద్ధకం. నాకు మరణమన్నా భయం లేదు."
"జీవితమంటే భయమన్నమాట?"
ఓడిపోయినా ననిపించిందో, లేక పూర్వపు గౌరవం తిరగ పెట్టిందో "అయితే ఏం చెయ్యమంటారు? ఇట్లానే హీనస్థితి ననుభవించమంటారా?" అన్నాడు వీరన్న.
"అన్ని స్థితుల్లోకీ హీనస్థితి ద్వేషం; మనుషుడో, దేవుడో తనకి హీనస్థితి నిచ్చాడనే కోపం, తిరుగుబాటు."
"ఇదంతా పూర్వం నించీ బ్రాహ్మలు బోధించిన విషం; తక్కువ జాతుల్ని అణగతొక్కి వుంచడానికి."
"అగ్రజాతుల్ని అణగతొక్కడానికి ఈ నాడు తక్కువ

జాతులు బోధిస్తున్న కాలకూట విషం ఈ ద్వేషం" అని గట్టిగా అన్నారు యోగిగారు.

"మీరు అగ్రజాతుల వేపా?"

"ద్వేషం లేనివారి వేపు."

"వారికి లేదా ద్వేషం?"

"ప్రస్తుతం పైకి లేదు, నువ్వు నీ ద్వేషంతో దాన్ని రగిల్చిందాకా."

"ఒక్క కులాలే కాదు; దేశాలు దేశాలమీద, పేదలు ధనికుల మీద తిరగబడి తమ హక్కుల కోసం నిలబడే జ్ఞానం, పటుత్వం వొచ్చాయి ఈనాడు."

"తిరగబడడం జ్ఞానమూ,పటుత్వమూ కావు, అజ్ఞానం, బలహీనత, నిజమైన పటుత్వం తిరగబడదు. ఇదివరకు లొంగిపోయిన బలహీనతే తిరుగుబాటులోకి రూపం మారింది. అంతే."

"మరి ఇట్లా అణిగి, నలిగి క్షీణించవలసిందే?"

"బలం లేనప్పుడే అవన్నీ జరుగుతాయి,"

"ఇంక మాకు సుఖమనేది అక్కర్లేదా?"

"సరైన మాటలకి వొచ్చావు. సుఖం దేనిమీద ఆధారపడి వుందో ఆలోచించుకో. సమత్వం, స్నేహం, సత్యం, సహనం-వీటి మీద. దేవుడు లేకపోనీ, ఈ విషయాలు ప్రతి హృదయంలో వెలుగుతున్నాయి. వాటి నించి తప్పి సుఖం లేదు. ఒకరు అన్యాయం చేస్తున్నారని నువ్వు న్యాయం తప్పితే, నిన్ను కాపాడేందుకు రక్షణ ఏదీ? తగూపెట్టి హక్కులు సంపాయిస్తావు. సుఖా న్నెక్కణ్నించి తెచ్చుకుంటావు?"

ఇట్లా వాదించుకునే వాళ్లూ వాళ్లిద్దరూ. కాని, యోగిగారి మాటలు వీరన్నకి నచ్చలేదు. ఓకిన పురాణ పీతు లనేవాడు.

మా కెవరికీ తెలీకుండానే గ్రామ విప్లవాన్ని సిద్ధంచేశాడు. దసరా. మా వూళ్లో పెద్ద పూజలు, పందిళ్ళు, సంతర్పణలు, కలశాలు, ఊరేగింపులు. ఆ హడవిడిలో ఓ రోజు సాయంత్రం వొచ్చి పడ్డారు

హరిజనులు వూరిమీద. కర్రలతో. నాకు తెలీగానే హడలిపోయివాను. ఎందుకంటే వీరన్న అంతర్యం నాకు తెలుసు.

"ఎబ్బే - యీ ప్రభుత్వం చేసే శాసనాలు ఏం లాభం లేదు. ఎన్నటికీ కలుపుకోరు మమ్మల్ని. ఎన్ని శిక్షలతో బెదిరించినా, ఇంకా రంధ్రాలు వెతికి తప్పించుకుంటారు. అట్లా కాదు. హరిజనులు విప్లవం చేసి మీ స్త్రీలకి హరిజన బిడ్డల్ని కనాలి" అనేవాడు.

అదీ నా భయం.

మా వూళ్ళో పెద్ద హరిజన సమస్య లేనేలేదు. ఆ ముసలి వాళ్ళని నొప్పించడం యెందుకని మరీ ఇళ్ళల్లో కలుపుకోలేదు మేము వాళ్ళని - అంతే.

"పోనీ వీరన్న పదేళ్ళు ఆగవోయ్. ఈ ముసలి వాళ్ళని చావనీ, మనందరం ఏకమవుదాం" అన్నాను.

"అప్పటికి నువ్వు ముసలివాడవై ఇప్పటి ముసలాళ్ళ మల్లేనే పట్టుబడతావు. నువ్వు లేకపోతే తక్కినవాళ్ళు పీ మాట సాగనీరు. అదేం లాభం లేదు" అన్నాడు. అతను చాలా కసిగా. నిజమే నని పించింది నాకూ.

ఆ దసరా నాడు ముందుగా హరిజనులు స్త్రీల గుంపు మీద పడ్డారు. వూరి మగవాళ్ళు చాలామంది పొలాల్లోకి వెళ్ళిపోయి నారు. మధ్యాన్నమే. నాకేం తోచలేదు. ఈనాడు హరిజనులు దుర్మార్గం చేసినా, రేపు మా వాళ్ళు వాళ్ళని నాశనం చెయ్యక మానరు. చప్పున యోగి జ్ఞాపకం వొచ్చాచు, ఒక్క పరుగు తీశాను ఆశ్రమానికి. నా వీపు వెనక హరిజనులు బలవంతం చేస్తున్న స్త్రీల అరుపులు, వాళ్ళకి అడ్డుపడ్డ మా యువకుల గోల.

ఆశ్రమం చాలా ప్రశాంతంగా వుంది. చిలకలు గుంపులుగా ఎగురుతున్నాయి వేపచెట్ల మీదికి. నా కళ్ళ ముందు నెమ్మదిగా తొలిగి పోయినాయి ఉడతలు. గాలి తీరుబడిగా వీస్తోంది. చెట్టుకింద శాంతంగా కబుర్లు చెప్పుకుంటూ కూచున్నారు స్వామిగారు, ఇద్దరు ముసిలమ్మ లతో. నన్ను చూడగానే చిరునవ్వుతో, "రా, కూచో" అన్నాడు.

హడావిడిగా నా కబురు కక్కాను. వెంటనే ఆ డబ్భై ఏళ్ళు దాటిన వృద్ధుడు లేచాడు.

"వేళాదా, అంత పనీ!" అంటో నా కంటే వడిగా పరిగెత్తుతు న్నాడు. ఆయన అట్లా ఆదుర్దా పడడం నేను ఎన్నడూ చూడలేదు. పుటకలేదు చావు లేదు అనే వేదాంతికి అంత ఆదుర్దా, మమకారం ఎందుకు? ఎవరికోసం?

ఆయన చాలాసార్లు చెప్పారు మా వూరి పెద్దలతో - "కాలం మారుతోంది. ఎందుకు ఏర్పడ్డదో ఈ వర్ణ బేదం-ఈ నాడు చాలా అన్యాయం, అసహ్యం. ఈ బేదాన్ని తీసెయ్యండి. రెండు పేటల్నీ కలి పెయ్యండి" అని.

"పెద్దలు తమరు కూడా అట్లాంటి వర్ణసంకరాన్ని బోధిస్తారా? ఋషులు పెట్టిన నియమాలు" అన్నారు వాళ్ళు.

"ఈ నాటి ఋషిని నేను. నేను చెప్పేమాట వినండి అనేవారు ఆయన. కాని ఎవరు వింటారు:

అయిదు నిమిషాల్లో చేరుకున్నాం మా వూరు. ఆ దృశ్యం ఏం చెప్పను? ఈ లోపల మా స్త్రీలని ఎన్ని అవమానాలు చేశారో! దూరం వించి పొలాల్లోంచి పరుగెత్తుకు వొస్తున్నారు మా వాళ్ళు-కర్రలతో, కొడవళ్ళతో, చేతి కత్తులతో.

పరాసరి అమ్మవారి పూజ పందిరిలోకి వెళ్ళాం. అక్కడ జరిగిన అసహ్యం వర్ణించలేను. విగ్రహాన్ని పగలకొట్టారు. అమ్మగారి పీఠా నికి ముందే వీరన్న నా భార్యని పట్టుకుని కిందపడేసి.........పందిరి గుంజని పీకి ఒక్క దూకు దూకాను అడ్డపడ్డ స్వామిగారిని కిందపడ తోసి. ఇంకా తన పెంపుడు కొడుకు మీదే మమత.

వీరన్న నన్ను చూసి అరుస్తున్న నా భార్యని వొదిలి పక్క నున్న కర్ర తీసుకుని నా మీదికి దూకాడు. తరవాత ఏం జరిగిందో—ఇద్దరం కొట్టుకున్నాం. చూసేసరి రెండు దెబ్బలూ మధ్య అడ్డం వొచ్చిన యోగి గారికి తగిలాయి. ఆయన "హరి హరీ" అంటో ప్రాణం విడిచారు.

నిర్ఘాంత పోయినాము ఆ రక్తం చూసి. అంతే. అక్కడితో అగిపోయింది ఆ వైరం. ఎక్కడి వాళ్ళు అక్కడ నిలిచి పోయినారు.

హరిజనులూ, మేమూ అందరమూ కలిసి అయనకి. సమాధి కట్టించాము. ఎంత మంది మా స్త్రీలని హరిజనులు ఏం చేశారో కిక్కురు మనకుండా ఊరుకున్నాము. వీరన్న కోరిక నెరవేరింది. స్వామిగారి అనుగ్రహాన పిల్లలు లేనివాళ్ళకి కొంత మందికి తొమ్మిది నెలల్లో పిల్లలు కలిగారు. మా ఊళ్ళో హరిజన సమస్య లేదు. ఆదర్శమైన గ్రామంకింద వినుతి కెక్కింది హరిజన సమస్యలను సాధించడానికి ప్రాణా లర్పించారని యోగిగారి కీర్తిని పత్రికల నిండా అచ్చు వేయించుకున్నాము. నాకూ, వీరన్నకూ ఆత్మైల్లు కైదు పడ్డది. ప్రతి సంవత్సరం హరియోగిగారికి ఈ ఉత్సవాలు చేస్తున్నాము. మొదటినుంచీ అంత గొప్ప సంస్కర్తకి ఆశ్రయ మిచ్చి ఆయన అహింసా బోధనల ప్రకారం నడుచుకున్న యోగ్యులకింద మా ఊరి పేరుని దేశమంతా చాటుకున్నాము. మా మూలానే హరియోగిగారు 'అంత గొప్పవారైనట్టూ ప్రగల్భా లాడుతున్నాము ఈనాడు."